


## నెలనెలా నవ్వుల పండగ

## మల్లాది వెంకటకృష్ణమూర్తి స్పెషల్

### కోడిపుంజు

తూర్పుగోదావరి జిల్లాలోని ఓ చిన్న వూరు

ఆ వూళ్ళో మెథడిస్ట్ చర్చ్‌లో కన్ఫెషన్ బాక్స్‌లో కూర్చుని ఉన్నారు ప్రీస్ట్ సెబాస్టియన్. నిత్యం నిర్ణీత సమయంలో ఓ అరగంట పాటు అక్కడ కూర్చుంటాడతను. ఒకటి రెండు రోజులకొకరు వచ్చి తాము చేసిన పాపం చెప్తారు. ఏం చేస్తే ఆ పాపం పోతుందో సెబాస్టియన్ తగిన సలహా ఇస్తాడు. ఆ చర్చి ఆరంభించినప్పటి నించి ఇది ఆనవాయితీగా వస్తోంది. సాధారణంగా భర్తని కొట్టిన భార్య, పక్కతోటలోని కొబ్బరి చెట్లనుంచి కాయలు దొంగిలించిన వారు, సారాయి తాగి పోట్లాటకి దిగిన వాళ్ళు కన్ఫెషన్ బాక్స్ దగ్గరికి వస్తుంటారు.

ఆ రోజు సెబాస్టియన్ కన్ఫెషన్ బాక్స్ లో కూర్చునీ కోర్చోగానే బయటి నించి కోడిపెట్ట రెక్కల చప్పుడు వినిపించింది.

"ఎవరది?" అడిగాడు ఫాదర్ సెబాస్టియన్.

"నమస్కారం ఫాదరూ. నేను మరియమ్మ కొడుకుని 'కన్ను పెసను' వచ్చానండయ్యా" వినిపించిందో గొంతు.

"చెప్పు ఏం పాపం చేసావు?" అడిగాడు ఫాదర్ సెబాస్టియన్.

"కోడి పుంజయ్యా..ఉదయం ఒకళ్ళింట్లోంచి దొంగిలించానయ్యా. ఇంటికెళ్ళి కొయ్యబోయే ముందు నాకు పాపం సేస్తున్నాననే బాధేసి, ఇక్కడికి లగెత్తుకొచ్చానయ్యా. కోడి పుంజుని వెంట తెచ్చానయ్యా. దాన్ని నువ్వు తీసేసుకుని నా పాపాన్ని పోగొట్టమని చెప్పడానికి వచ్చానయ్యా.."

"ఊహుఁ.. నేను తీసుకోనా కోడిపుంజుని.."

"తీసుకో ఫాదరూ. తీసుకుని నా పాపం కాయమని బెతిమలాడడానికి పనివేళా ఇక్కడికి వచ్చానయ్యా.."

"నేను తీసుకోనన్నాగా? నీ పాపం పోవాలంటే నువ్వు దాన్ని ఎవరింట్లోంచి దొంగిలించావో ఆ ఇంటాయనకి తిరిగి ఇచ్చెయ్. దాంతో నీ పాపం ప్రక్షాళనమై నువ్వు నరకం నుంచి కాపాడబడతావ్.."

"అక్కడే చిన్న చిక్కొచ్చిందయ్యా. ఆ ఇంటాయన కోడిని తీసుకోనంటున్నాడు.."

కొద్ది క్షణాలు ఆలోచించి చెప్పాడు ఫాదర్.

"అలాగా? నువ్వు చెప్పేది నిజమేనా?"

"నీతోడు ఫాదరూ.."

"సరే! అది నిజమే అయితే నువ్వు దాన్ని నీ కుటుంబం కోసం నీ దగ్గరే ఉంచుకోవచ్చు."

"అలా చేస్తే పాపమేమోనన్న అనుమానం తీర్చుకోడానికి వచ్చానయ్యా.."

"కోడి అసలు యజమాని వద్దన్నాక పాపం లేదు. అందుకు హామీ నాది. వెళ్ళు.."

"సిత్తం.. ధర్మ ప్రభువులు.." కన్ఫెషన్ బాక్స్‌కి మొక్కి మరియమ్మ కొడుకు చంకలో కోడితో వెళ్ళిపోయాడు.

చర్చి మూసేసాక ఆరాత్రి తన ఇంటికి వెళ్ళాడు సెబాస్టియన్.

"ఏమండీ.. ఈ ఉదయం మనకోడి పుంజుని ఎవరో ఎత్తుకెళ్ళారండీ.." అతనికెదురొచ్చిన భార్య చెప్పింది అయనతో.

***

## చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

కొత్తగా సమితి ప్రెసిడెంటుగా ఎన్నికైన ఎల్లారావు హైదరాబాదులోని ఒకాఫీసుకెళ్ళి లిఫ్టుయెక్కి పదో అంతస్థుకు పోనీమన్నాడు.

"అక్కడ తమరెవర్ని చూడాల్సార్?" అనడిగాడు లిఫ్టుబాయ్ ఆయన మొహంకేసి చూస్తూ.

"ఆయ్.. అక్కడ నేనెవర్ని చూస్తే నీకెందుకోయ్. ఒళ్ళు దగ్గర పెట్టుకుని నీ పని నువ్వు చూసుకో" అని దబాయించాడు ఎల్లారావు గుడ్లురుముతూ.

"అలాగే సార్. కాని ఈ బిల్డింగుకు వుంది ఆరు అంతస్థులే" అన్నాడు లిఫ్టుబాయ్ వినయంగా చేతులు జోడించి.

ఒక ఎత్తైన కొండమీద నుంచి దూకి ఆత్మహత్య చేసుకోబోతున్న ఒక యువకుడ్ని చెయ్యిపట్టుకుని ఆపాడు నిరంజనం.

"చూడు మిస్టర్. నీవు ఆత్మహత్య చేసుకోబోయేముందు ఒక్కసారి నీ పిల్లల్ని గురించి ఆలోచించు" అన్నాడు నిరంజనం అతని కళ్ళలోకి చూస్తూ.

"నాకు తల్లీ తండ్రి యిద్దరు లేరు. అసలు నాకు నా అన్నవాళ్ళెవరూ లేరు" అన్నాడా యువకుడు నిరాశగా.

"అయితే వెంటనే దూకు. నువ్వు ఈ ప్రపంచంలో బతకడం అనవసరం" అన్నాడు నిరంజనం తన దారిన తానుపోతూ.

త్వరలో పెళ్ళి చేసుకోబోతున్న పెంచల్రావు తన భవిష్యత్తు తెలుసుకోవడం ఎందుకైనా మంచిదని ఒక మంచి జ్యోతిష్యుణ్ణి కలిసి చెయ్యిచూపించాడు.

"మీరు నలభై సంవత్సరాల వయసు వచ్చేవరకు అనేక కష్టాలకు గురవుతారు" అన్నాడు జ్యోతిష్కుడు చేతిని బూతద్దంతో బాగా పరిశీలించి.

"ఆ తరువాత?" ఆందోళనగా అడిగాడు పెంచల్రావు.

"బాగా సుఖపడతారు?" అన్నాడు జ్యోష్కుడు.

"అంటే లాటరీ ఏమన్నా వస్తుందా?" ఆనందంగా అడిగాడు ఈసారి.

"కాదు."

"మరి?"

"నీ భార్యకు పక్షవాతం వచ్చి నోరుపడిపోతుంది"

ఓ.కె. రావు రిటైర్డ్ మిలటరీ ఆఫీసరు. వయసు పైబడినా మంచి జ్ఞాపకశక్తి వుంది ఆయనకు.

"మీరు యింత గొప్ప జ్ఞాపకశక్తి ఎలా సంపాదించారు?" అనడిగాడు ఓ మిత్రుడు.

"నేను మిలిటరీలో చేరిన కొత్తల్లో నా జ్ఞాపకశక్తి అంతంత మాత్రంగానే వుండేది. అలాంటిది ఒకసారి మేము ప్రయాణం చేస్తున్న విమానానికి నిప్పంటుకుంది. వెంటనే అందర్నీ పారాచూట్ల సాయంతో కిందకి దూకెయ్యమన్నారు. నేనూ అలాగే దూకేసాను. తీరా దూకిన తర్వాత గుర్తొచ్చింది పారాచూట్ మర్చిపోయానని. అంతే అప్పట్నించీ నా జీవితంలో ఏది మర్చిపోలేదు" అన్నాడు ఓ.కె.రావు గతాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ భయంగా.

అర్ధరాత్రి ఒంటిగంటప్పుడు తూలుతూ రోడ్డమ్మట నడుస్తున్న శేఖరాన్ని పోలీసు ఆపి "ఇంత రాత్రప్పుడు ఎక్కడికి వెళుతున్నావ్?" అని గదమాయించాడు.

"ఉపన్యాసం విందామని వెళుతున్నాను" అన్నాడు శేఖరం మామూలుగా.

"ఉపన్యాసమా? ఎవరిది? ఈ వేళప్పుడు టౌన్లో ఎక్కడా మీటింగులు లేవే" అన్నాడు పోలీసు అనుమానంగా.

"ఈ టైములో ఇలాంటి పరిస్థితుల్లో ఇంటికెళితే నా భార్య ఓ గంట వుపన్యాసమిస్తుందిలే. దాని సంగతి నే చెప్పేది" అన్నాడు శేఖరం తూలుతూ.

ఒక రిటైరైన సైనికోద్యోగి మేజర్ సుబ్బారావు ఊరు చివర ఒక మంచి ఇల్లు కట్టుకుని సకుటుంబంగా ప్రశాంత జీవనం గడుపుతున్నాడు. చాలాకాలం తర్వాత కలుసుకున్న ఒక మిత్రుడు అడిగాడు.– "మీ ఉద్యోగజీవితానికీ, ఇప్పటి జీవితానికీ తేడా ఏం కనిపిస్తోంది" అని.

"ఏమీలేదు" అన్నాడు మేనేజర్ సుబ్బారావు.

మిత్రుడు ఆశ్చర్యంగా "ఏమీ లేదా?" అన్నాడు.

"అవును" అని దూరంగా ఆడుకుంటున్న భార్య, ఏడుగురు పిల్లలను చూపిస్తూ "అప్పుడా సైన్యంలో ఉన్నాను. ఇప్పుడీ సైన్యం మధ్య ఉన్నాను. అంతే" అన్నాడు సుబ్బారావు.

ఇద్దరు డోసు బాబులు కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు.

"నా భార్యకు ఒక పెద్ద చెడ్డ అలవాటు వుందోయ్ రోజూ రాత్రిపూట ఒంటిగంట, రెండుగంటలదాకా మేలుకుని వుంటుంది. నేనా అలవాటును మాన్పలేక పోతున్నానోయ్" అన్నాడొకడు దిగులుగా.

"అంతసేపటివరకు మేలుకుని ఏం చేస్తుంటుందోయ్?" అనుమానం వెలిబుచ్చాడు ఇంకొకడు.

"బారునుంచొచ్చే నాకోసం ఎదురు చూస్తుంటుంది."

"మీ మహిళామండలి ప్రెసిడెంటు పోస్టుకు ఎవ్వరూ పోటీ చెయ్యరెందుకని? ఎప్పుడూ ఖాళీగానే వుంటుందేం?" అనుమానంగా అడిగాడు ఆడిటర్.

"మరేం లేదు లెండి. మా ప్రెసిడెంటు పదవికి పోటీ చెయ్యబోయే ఆవిడ వయసు కనీసం ముప్పై సంవత్సరాలన్నా వుండాలన్న నిబంధన ఒకటుంది. అందుకని" అంది కార్యదర్శిని.

COMMENTS